## బాధిత కుటుంబానికి సీపీఐ ఆర్థిక సహాయం



**డైనమిక్ న్యూస్, చిలుకూరు** చిలుకూరులో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన కందుకూరి గురవయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి రూ.16,500 నగదును బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బలహీన వర్గాలకు అండగా నిలవడం పార్టీ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## రాత్రిపూట ట్రాక్టర్ ప్రయాణాలపై పోలీసుల హెచ్చరిక



**నేరేడుచర్ల, డైనమిక్ న్యూస్** ట్రాక్టర్ ట్రాలీలకు నెంబర్ ప్లేట్లు, రేడియం స్టిక్కర్లు లేకుండా రాత్రిపూట ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ట్రాక్టర్లపై మైకులు ఏర్పాటు చేయడం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. హుజూర్‌నగర్, గరిడేపల్లి, పొనుగోడు ప్రాంతాల నుంచి వచ్చే ట్రాక్టర్లు శివాలయం బైపాస్ -- గంగమ్మ తల్లి ఎదురు -- హోసన్న మందిర్ బైపాస్ మార్గం ద్వారా నేరేడుచర్ల పట్టణాన్ని దాటాలని సూచించారు. రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా ట్రాలీలకు రేడియం స్టిక్కర్లు అతికించినట్లు తెలిపారు.

## దొడ్డి కొమురయ్య జయంతి ఘనంగా నిర్వహణ



**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురయ్య త్యాగం, ధైర్యం యువతకు స్ఫూర్తిదాయకమని, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహులు మాట్లాడుతూ కొమురయ్య అమరత్వం తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గజవాహన సేవతో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా



**హుజూర్నగర్, డైనమిక్ న్యూస్** శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో రాత్రి 10 గంటలకు శ్రీ వేణుగోపాల స్వామి, రుక్మిణి--సత్యభామ సమేతంగా గజవాహన సేవ, గోదాదేవి పల్లకి సేవలతో ఎదుర్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యాగ్నికులు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బేతవోలు గ్రామ కోలాట బృందం ప్రదర్శనలు ఆకట్టుకోగా, అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు.

## సూర్యాపేట పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఫిర్యాదు దారులతో మాట్లాడిన ఎస్పీ, కేసులపై వేగంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారికి భరోసా కల్పించాలని సూచించారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి 'ఆపరేషన్ రోప్'ను సమర్థంగా అమలు చేయాలని చెప్పారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ తనిఖీలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, ఐలయ్య, మహేందర్ నాథ్, శివతేజ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు



**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరజీవి దొడ్డి కొమరయ్యకు బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఘనంగా నివాళులు అర్పించారు. నేరేడుచర్ల మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో జరిగిన సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన తొలి వీరుడు దొడ్డి కొమరయ్య అని పేర్కొన్నారు. ఆయన త్యాగస్ఫూర్తితోనే తెలంగాణ ప్రజల్లో పోరాట చైతన్యం పెరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## తిరుకల్యాణ బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహణ



**హుజూర్‌నగర్, డైనమిక్ న్యూస్** శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి 10 గంటలకు శ్రీ వేణుగోపాల స్వామి రుక్మిణి, సత్యభామ సమేతంగా గజవాహన సేవ, గోదాదేవి పల్లకి సేవలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాగ్నికులు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు పాల్గొన్నారు. బేతవోలు గ్రామ కోలాట బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

## సాయి శ్వేత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక



**మంగళగిరి , డైనమిక్ న్యూస్** మంగళగిరి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన లోకం సాయి శ్వేత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆమె తండ్రి జనార్ధన్ కూడా కొన్నేళ్లుగా మంగళగిరి కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. సాయి శ్వేత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక అవటం పట్ల మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జొన్నాదుల లెనిన్ బాబు జనరల్ సెక్రటరీ బేతపూడి నాయుడమ్మ, వైస్ ప్రెసిడెంట్ కురగంటి రమేష్ జాయింట్ సెక్రెటరీ సూరబోయిన మురళి, ఎస్ రామచంద్రరావు, దొడ్డక బ్రహ్మానందరావు కూరపాటి అంబేద్కర్, మురళీ రాజు, కట్టె పోగు కోటేశ్వరరావు చిలకా శ్రీధర్ తదితరులు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇండియన్ నేవీ అమ్ములపొదిలోకి

భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అణుశక్తితో రూపొందించిన జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమాన్‌ను లాంఛనంగా ప్రవేశపెట్టారు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. ఫలితంగా అణు నావికాదళ విభాగం మరింత బలోపేతం అయింది. అంతకుముందు అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ తారాగిరి శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత్ అత్యంత గోప్యంగా షిప్ సబ్‌మెర్సిబుల్ బాలిస్టిక్ న్యూక్లియర్ ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చింది. ఈ ప్రాజెక్ట్ కింద ఐఎన్ఎస్ అరిహంత్ మొదటి నౌక కాగా, దాని తర్వాత ఐఎన్ఎస్ అరిఘాట్ అనే మరో నౌక వచ్చింది. తాజాగా మూడో నౌక ఐఎన్ఎస్ అరిదమాన్?ను కమిషన్ చేశారు. విశాఖపట్నంలో నిర్మించిన ×చీూ అరిదమాన్‌ను ఈ నౌకను అనేక నెలల పాటు సముద్ర పరీక్షలు చేసిన తర్వాత నౌక దళంలోకి ప్రవేశపెట్టారు. ఐఎన్ఎస్ అరిహంత్ భారత్ మొట్టమొదటి స్వదేశీ అణు జలాంతర్గామి. దీనిని జూలై 2009లో ప్రారంభించి 2016లో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. రెండో నౌక ×చీూ అరిఘాట్‌ను ఆగస్టు 2024లో ప్రవేశపెట్టింది. అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్న కొన్ని దేశాల జాబితాలో భారత్? కూడా చేరింది. ప్రస్తుతం అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వద్ద ఈ జలాంతర్గాములు ఉన్నాయి.

### శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం

స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన తారాగిరి భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు వివరించాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ యుద్ధనౌక ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.

### ఐఎన్ఎస్ తారాగిరి విశేషాలివే

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువు ఉండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది. భారత్‌ను బలమైన నౌకాదళ శక్తిగా తీర్చిదిద్దడంలో నావల్ సైన్స్, టెక్నలాజికల్ లాబొరేటరీ చేస్తున్న కృషిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

## మందుబాబులకు 'పెగ్గు' మరింత ఖరీదు!

పశ్చిమాసియాలోని యుద్ధ భయం భారత్‌లో మందుబాబుల పాలిట శాపంగా మారింది. ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాలు మన దేశంలోని మద్యం బాటిళ్ల ధరలను పెంచేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు

## గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహణ



**ముటుకూరు, డైనమిక్ న్యూస్** యేసుక్రీస్తు త్యాగానికి ప్రతీకగా గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని ముటుకూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ఇవాంజిలికల్ క్రీస్తు లూథరన్ దేవాలయంలో జరిగిన ప్రార్థన కార్యక్రమాలకు పాస్టర్ కటికల యేసుదానం ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసుక్రీస్తు సర్వ మానవాళి పాపముల కొరకు సిలువపై ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్ ఫ్రైడే అని తెలిపారు. ఈ రోజున విశ్వాసులు ఉపవాసం, ప్రార్థనలు, నిశ్శబ్ద ధ్యానాలతో భక్తిని చాటుకుంటారని చెప్పారు. పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డా. కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ, సిలువపై యేసుక్రీస్తు పలికిన చివరి మాటల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తులకు బెల్లంపానకం, నాన్ రొట్టెలు పంపిణీ చేశారు.

## ఒకప్పుడు అటెండర్ చేసిన ఆఫీసులోనే ఎమ్మార్వో విధులు నిర్వహిస్తున్న సూరయ్య




**డైనమిక్ న్యూస్ మోతే ఏప్రిల్ 3** నడిగూడెం తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన సోమ పనులు సూరయ్య ప్రస్థానం అందరికీ స్ఫూర్తినిస్తుంది 1995లో తండ్రి మరణంతో కారుణ్య నియామకం కింద అదే కార్యాలయంలో అటెండర్ గా ఆయన వృత్తి జీవితం ప్రారంభించారు పట్టుదలతో విద్యార్హతలు పెంచుకుంటూ శాఖా పరమైన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అంచలంచెలుగా ఎదిగారు నాడు అటెండర్ గా పనిచేసిన చోటే నేడు ఉన్నంత అధికారిగా మండల రెవెన్యూ ఆఫీసర్ గా ప్రమోషన్పై నడిగూడెం రావడం వలన ఆయన తోటి చేసిన వ్యక్తులు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఎమ్మార్వో సీటుపై కూర్చోవటం సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో గల ప్రజాప్రతినిధులు తోటి ఉద్యోగస్తులు మరియు మండల పలువురు సర్పంచులు అభినందనలు తెలియజేసినారు అదేవిధంగా ఈ అవకాశాన్ని కల్పించిన శ్రీయుత గౌరవ జిల్లా కలెక్టర్ సూర్యాపేట గారికి కోదాడ ఆర్డీఓ గారికిప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినాడు

## ధూప దీప నైవేద్యాల సామాగ్రి అందజేత



**డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్** హుజూర్‌నగర్ పట్టణంలోని పీర్లకొట్టం వెనుక బజారులో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక వార్డు పెద్దలు తూముల శ్రీనివాస్--శ్రీదేవి దంపతులు ఒక సంవత్సరం పాటు ధూప, దీప, నైవేద్యాల ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నేడు ఒక నెలకు సరిపడ నైవేద్య, పూజా సామాగ్రిని వారి కుమారుడు మణిశంకర్ చేతుల మీదుగా ఆలయ పూజారి బంగారు రమాదేవికి అందజేశారు. ప్రతి నెల ఇదే విధంగా సామాగ్రి అందజేస్తూ, పర్వదినాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ భద్రమ్మ, రమేష్, సామాజిక కార్యకర్తలు రాము, రామిశెట్టి రాము, మహేష్, సతీష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మాసాయిపేట బంగారమ్మ గుడి పక్కన భిక్షాటన చేసే మహిళ మృతదేహం లభ్యం



**డైనమిక్ న్యూస్ మాసాయిపేట్** మెదక్ జిల్లా మాసాయిపేట గ్రామ శివారులోని బంగారమ్మ గుడి ప్రక్కనగల బాత్రూమ్ ప్రక్కన చెట్టు కింద ఒక గుర్తు తెలియని భిక్షాటన చేసే మహిళ వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు గల వ్యక్తి అనారోగ్యముతో చనిపోయి ఉన్నది అని ఇట్టి విషయములో మాసాయిపేట గ్రామ సర్పంచి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకో ని దర్యాప్తు ప్రారంభించినైనది. తూప్రాన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు అట్టి గుర్తుతెలియని మహిళా వివరాలు తెలిసినచో చేగుంట పోలీస్ వారికి తెలుపగలరు

## బాలికల విద్యకు ఎలక్ట్రిక్ భరోసా




**టేక్మాల్, డైనమిక్ న్యూస్** దాదాయిపల్లి సర్పంచ్ దేశ్‌పాండే నరసింహారావు గ్రామ బాలికల కోసం ఉచిత ఎలక్ట్రిక్ వాహనాల పథకం ప్రకటించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు సైకిళ్లు, డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు అందించనున్నారు. రవాణా సమస్యల వల్ల చదువు ఆగకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు.

